క్లుప్తంగా

స్వామి అల్వాల్ మరణం తీరనిలోటు



స్వామి అల్వాల్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

నల్లకుంట: ప్రముఖ సంఘ సేవకుడు, గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్ మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం రాత్రి మృతి చెందారు. స్వామి అల్వాల్ పార్థివ దేహాన్ని నల్లకుంట సంజయ్‌నగర్‌లోని అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ అమృత, స్కైలాబ్ బాబు, సీపీఎం అంబర్‌పేట జోనల్ కార్యదర్శి మహేందర్‌తో పాటు పలువురు ప్రజాసంఘాల నేతలు వచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. సంత్ గాడ్గేబాబా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల స్ఫూర్తితో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ స్వామి అల్వాల్ మరణం సామాజికోద్యమాలకు తీరని లోటన్నారు. సామాజిక సేవల కోసం తన 300 గజాల ఇంటి స్థలాన్ని విరాళంగా అందజేశారని కొనియాడారు. అలాగే తన సొంత ఖర్చులతో ఆ స్థలంలో సంత్ గాడ్గేబాబా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, భగత్ సింగ్, చాకలి ఐలమ్మ లాంటి 20 మంది మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, గోసుల విజయ్ కుమార్, వంపు లక్ష్మయ్య, బచ్చన్న, నల్లపు సోమన్న, నరేందర్, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సీఐటీయూ జిల్లా నాయకుడు రాములు, ఇరిగి నర్సింగ రావు, డాక్టర్ రాజాలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

పుట్ట పాండురంగయ్యకు ఓయూ డాక్టరేట్



కాచిగూడ: బాగ్ అంబర్‌పేట, డీడీ కాలనీకి చెందిన పుట్ట పాండురంగయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఎక్స్‌పరిమెంటల్ స్టడీ ఆన్ మెకానికల్ ప్రాపర్టీస్ అండ్ ఫ్లెక్సరల్ బిహేవియర్ ఆఫ్ హై స్ట్రెంత్ జియో పాలిమర్ కాంక్రీట్' అనే అంశంపై ఓయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ వి.భిక్షా పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ అందుకున్నారు. ఓయూ స్నాతకోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమక్షంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, అడోబ్ సంస్థ సీఈఓ శంతన్ నారాయణ్ (యుఎస్ఏ) పాండు రంగయ్యకు డాక్టరేట్ అందజేశారు. పాండు రంగయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇరిగేషన్ విభాగంలో 20 సంవత్సరాలకు పైగా గెజిటెడ్ హోదాలో పనిచేసి పదవీ విరమణ పొందారు. అఖిల భారత పద్మశాలీ ఇంజినీర్స్ విభాగం సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఆయన సామాజిక సేవారంగంలో తనవంతు కృషి చేస్తున్నారు.

పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేదలు, జీహెచ్ఎంసీ కార్మికులు సుమారు 600 మందికి పైగా బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్కు, చిక్కడపల్లిలో అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందూరి కృష్ణ, ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అనే భావనతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. హైకోర్టు న్యాయవాది కె.కౌశిక్, ఫౌండేషన్ సభ్యులు జ్వాలా వరావలి, హెచ్.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి బాలుడికి తీవ్ర గాయాలు



కాచిగూడ: రైల్లో నుంచి ఓ గుర్తుతెలియని బాలుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాకుత్‌పురా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో నుంచి ఓ గుర్తుతెలియని బాలుడు (4) కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల విధులకు 2500 మంది సిబ్బంది నియామకం
- ఫిర్యాదులపై తక్షణ చర్యలు
- నిశితంగా అభ్యర్థుల అఫిడవిట్‌ల పరిశీలన

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అపర్ణ తెలిపారు. ఇప్పటికే ఎన్నికల కోసం పూర్తి స్థాయిలో కసరత్తు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణపై ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు

సాక్షి: నామినేషన్ల స్వీకరణ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?

ఆర్‌వో: ఈ నెల 3వ తేది నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది. అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఉదయం 11:00గంటల నుంచి సాయంత్రం 3గం వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు.

సాక్షి: అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు ఏమిటి?



అంబర్‌పేట్ రిటర్నింగ్ ఆఫీసర్ అపర్ణ

ఆర్‌వో: నామినేషన్ వేసే అభ్యర్థులు ఆర్‌వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే ర్యాలీలను నిలిపివేయాలి. అభ్యర్థితో పాటు మరో ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుంది. జనరల్ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ. 5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

సాక్షి: ఎన్నికల నిబంధనలు ఎలా అమలు చేస్తున్నారు?

ఆర్‌వో: నియోజకవర్గంలో ఆరు బృందాలు 24/7 విధులు నిర్వహిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం. ఫిర్యాదులు ఇప్పటివరకు రాలేదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక పరిశీలన బృందం నిఘా ఏర్పాటు చేసింది.

సాక్షి: ఎన్నికల నిర్వహణకు సిబ్బంది వినియోగం ఎలా?

ఆర్‌వో: పోలీస్ విభాగం మినహా పోలింగ్ కేంద్రాల్లో ఇతర విధులు నిర్వహించడానికి దాదాపు 2500 మంది సిబ్బందిని వినియోగించనున్నాం.

సాక్షి: ఎన్నికల్లో ప్రలోభాలను ఎలా నియంత్రిస్తారు?

ఆర్‌వో: నిఘా బృందాలు ప్రలోభాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాయి. నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందితే తక్షణ చర్యలు తీసుకుంటాం.

బీసీల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీ ఒక్కటేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బీసీలను ఆదుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో బీసీ నేతను ముఖ్యమంత్రిని చేస్తామనే నినాదంతోనే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి బీసీ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ మంత్రులు మర్రి శశీధర్ రెడ్డి, సి.కృష్ణయాదవ్, పార్టీ నేతలు పాపారావు, డాక్టర్ పద్మ, బండ కార్తీక రెడ్డి, దీపక్ రెడ్డి, సి. నందకిషోర్ యాదవ్, సాధన ఠాకూర్, సందీప్ సాయి, మహిపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ జాతీయ నాయకులు పల్లెపు ఉపేందర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాంగానికి ప్రమాదకరంగా మారిన మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎంసీపీఐ(యూ) జాతీయ నాయకులు పల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐయూ వ్యవస్థాపకులు మద్దికాయల ఓంకార్ 15వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మతతత్వాన్ని పెంచి పోషిస్తూ మైనార్టీ వర్గాలపై దాడులు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన చట్టసభలను కేంద్రం మనువాద విధానాలతో కూలదోసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. ఓంకార్ వామపక్షాల ఐక్యతను ఆకాంక్షించారని గుర్తు చేశారు. మనువాద బీజేపీని దానిని బలపరిచే అన్ని పార్టీలను ఎదురించి పోరాడటమే ఓంకార్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ ఓంకార్ రాజ్యాంగ హక్కులను రక్షించడానికి చట్టసభల్లో తన గలాన్ని వినిపించారని గుర్తు చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఓట్ల కోసం, సీట్ల కోసం విద్వేషాలను రెచ్చగొడుతూ పాలిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, ప్రజాపంథా కార్యదర్శి రాయల చంద్రశేఖర్, న్యూడెమోక్రసీ కార్యదర్శి గోవర్ధన్, ఎస్‌యూసీఐ కార్యదర్శి సి.హెచ్.మురహరి, ఆర్ఎస్‌పీ కార్యదర్శి జానకిరాముడు, జి.రాములు, కెవిపిఎస్ కార్యదర్శి స్కైల్యాబ్‌బాబు, తుకారామ్‌నాయక్, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీ



మాట్లాడుతున్న గౌతం రావు, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్య మంత్రిని చేస్తామని ప్రకటించడం పట్ల ప్రధాని మోదీకి బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతం రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం నల్లకుంటలోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ వై.అమృతతో కలిసి వివరాలు వెల్లడించారు. బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద ప్రారంభమయ్యే ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, అంబర్‌పేట నియోజక వర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, పార్టీ పదాధికారులు, బూత్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న అంజన్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక సారి అవకాశం కల్పించి గెలిపించాలని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని ధోబీ గల్లీ, మున్సిపల్ క్వార్టర్స్, అడ్వకేట్ కాలనీ, దేవి ప్రసాద్ బాగ్, సూరజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించి వారిని మోసం చేశారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని విమర్శించారు. తాను గతంలో ఎంపీగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధే తప్ప బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా జరిగిన అభివృద్ధి కనిపించడంలేదని ఇది ప్రజలు గమనించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, ఇచ్చి అర్హులైన వారిని మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ ఎ–బ్లాక్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు పి. భాస్కర్, కేఆర్‌కె ప్రసాద్, వి.శాంతి కుమార్, సంజయ్‌సింగ్, గుర్రం శంకర్, కవిత, ధర్మేందర్, లక్ష్మణ్, ప్రభాకర్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ యుద్ధ భేరిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వంగపల్లి, మేడి పాపయ్యమాదిగ

ముషీరాబాద్: మాదిగ, మాదిగ ఉప కులాల న్యాయబద్ధమైన వాటా సాధనకు నవంబర్ 5న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మాదిగ యుద్ధ భేరి సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ అన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమైన వాటా సాధనకు, దాదాపు 70 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో కేటాయింపులు జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న 'చలో ఇందిరాపార్క్' పేరుతో మాదిగ యుద్ధ భేరి బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. లక్షలాది మాదిగలను ఏకతాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి తమ డిమాండ్లను పరిష్కరించుకుంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మాదిగలు ముందుండి పోరాటం చేశారని తెలిపారు. డప్పు, చెప్పుకు రూ. 4 వేల పెన్షన్ ప్రకటించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మాదిగల వాటా తేల్చాలని, అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 25 శాతం సీట్లను కేటాయించాలని, అసెంబ్లీ సీట్ల కేటాయింపులో పునఃపరిశీలన చేయాలని, దళిత బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు కొండ్రా శంకర్, డాక్టర్ మల్లేశం, పొట్టపెంజర రమేష్, చింతబాబు, సలెంద్ర బాబురావు, జీడి నర్సింహ్మ, మల్లెపోగు శ్రీనివాస్, కేదాసి మోహన్, ఆకారపు రుక్కమ్మ, వి.ఎస్.లక్ష్మి, మంచాల యాదగిరి, పుర్రె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ కృషితోనే హైదరాబాద్ సంస్థానం విలీనం



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

చిక్కడపల్లి: హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించిన తేజోమూర్తి భారత ఉప ప్రధానమంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని బీజేపీ గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్ కుమార్ అన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ నగర కార్యాలయం వద్ద సర్దార్ పటేల్‌జయంతి సభ నిర్వహించారు. నాయకులు వినయ్‌కుమార్, టి.గోపాల్, బి.యాదగిరిగౌడ్, డీఎస్‌రెడ్డి, శ్రీకాంత్, మహమూద్, సురేష్‌కుమార్, నర్సింగ్‌రావు, నర్సింహ, ఆనంద్‌రావు, సత్యం, ప్రకాష్‌యాదవ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ బీజేపీ కార్యాలయంలో..

కాచిగూడ: బీజేపీ కాచిగూడ పార్టీ కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, హజారి బాబు, శిరీసాగర్, మల్లికార్జున్, అరవింద్, బల్వీర్, సునిల్, ఆర్.సంతోష్, దిలీప్, వాసు, ఎం.నర్సింగ్ రావు, బి.భీమ్‌రాజ్, సత్యనారాయణ, బాలప్రసాద్, లావణ్య, ఎస్.రవియాదవ్ పాల్గొన్నారు.

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య మాట్లాడుతూ సంస్థానాల రూపంలో 560 ముక్కలుగా విడిపోయి ఉన్న భారతదేశాన్ని అఖండ భారతంగా మార్చే క్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.చిన్నిబాబు, ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, హరితహారం కన్వీనర్ ఎస్.వి.రవి ప్రకాష్, అధ్యాపకులు డాక్టర్ ఆంజనేయులు, ఏ.తిరుపతి, బి.విజయనిర్మల, కె.నవీనరాణి, ఎల్.విష్ణుప్రియ, ఎం.సంగీత, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

కవాడిగూడ: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి నగర్‌లో డివిజన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ.... మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, అందుకోసం ప్రతి కార్యకర్త అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా చేరవేయాలన్నారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇస్తున్న ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎస్‌డి సాయికృష్ణ, సీనియర్ నాయకుడు వల్లాల శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్, శ్రీహరి, విశ్వనాథ్, దుర్గస్వామి, మహిళా నాయకులు మాధవి, రూప, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ప్రచారం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ బాపునగర్‌లో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ తెలిపారు. రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బాపునగర్, శాంతినికేతన్ గ్రౌండ్, వివేక్‌నగర్, కాపువాడ, హనుమాన్‌టెంపుల్, లేబర్ ఆఫీస్ లేన్, ఎస్ఆర్‌టి జవహర్‌నగర్, అశోక్‌నగర్ సర్కిల్, అశోక్‌నగర్ క్రాస్ రోడ్, జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ వరకు ప్రచారం కొనసాగుతుందన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకటి



భోలక్‌పూర్ యూపీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రభుత్వ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలు, మందుల నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమం విజయవంతంగా కొనసాగేలా వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు. ప్రతి మంగళవారం మహిళలకు మాత్రమే ప్రత్యేక వైద్య పరీక్షలు చేసే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తిప్రియాంక, డాక్టర్ మెహరున్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ముఠా గోపాల్

ముషీరాబాద్: అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లలాంటివని వచ్చే ఎన్నికల్లో ఈ రెండే తనను గెలిపిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. 2018లో పోటీ చేసిన డాక్టర్ కె.లక్ష్మణ్, కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ దఫా పోటీ చేయకుండా పారిపోయారని ఇప్పుడు పోటీ చేస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్ కూడా ఎన్నికల తర్వాత కనుమరుగవడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో లక్షకు పైగా ప్రజలు సంక్షేమ పథకాలతో లబ్ధిపొందరని వారే తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇక నియోజకవర్గంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచినీటి పైపులైన్లు, విద్యుత్ దీపాలు, నాలాల రిటైనింగ్ వాల్స్, బిడ్జీల నిర్మాణం చేపట్టామన్నారు. ముషీరాబాద్‌లో నిర్మించిన స్టీల్ బ్రిడ్జీ హైదరాబాద్ నగరానికే తలమానికమని తెలిపారు. బీజేపీకి తనపై పోటీ నిలపడానికి అభ్యర్థే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. ముషీరాబాద్‌లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక తెలంగాణలో ఆ పార్టీ పరిస్థితిపై చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

శభాష్ ముషీరాబాద్ పోలీస్...



ముషీరాబాద్ పోలీసులను అభినందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య

ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్‌తో పాటు అదనపు ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య అభినందించారు. పాత నేరస్తులపై నిఘా పెట్టి వారిని అరెస్టు చేయడంలో తీసుకున్న శ్రద్ధను కొనియాడారు. భోలక్‌పూర్‌కు చెందిన రౌడీషీటర్ మహబూబ్ అలియాస్ లడాస్ గత కొన్నేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతను తాజాగా భోలక్‌పూర్‌లో ఒక ఆటోను కూడా తగలబెట్టాడు. పటాన్‌చెరువులో జరిగిన ఓ హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న అతను కోర్టుకు సైతం హాజరుకావడం లేదు. ఇతడిపై నిఘా పెట్టిన ముషీరాబాద్ పోలీసులు గుల్బార్గలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2021లో రిసాలగడ్డలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడి ఉన్న మోహియుద్దీన్ కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అతడిని మాదాపూర్ ప్రాంతంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులను చేధించినందుకు గాను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిఐ డి.వెంకట్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.ప్రసాద్‌రెడ్డి, వై.చలపతిరెడ్డి, ఆర్.ప్రేమ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.కిషోర్, కానిస్టేబుల్స్ ఎం.ప్రకాష్, జి.సాయికుమార్ ఉన్నారు.

అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: కొందరు కోవర్టుల కారణంగా కాంగ్రెస్ పార్టీ నష్టపోయిందని వారు పార్టీకి పని చేసింది ఏమీ లేదని, బీఆర్ఎస్‌లోకి వెళ్లిన తర్వాతనైనా ఆ పార్టీకి న్యాయం చేస్తారేమో చూడాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం అడిక్‌మెట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నారని వారు నెల రోజులు తిరక్కముందే పశ్చాతాపపడతారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పార్టీ మారే వారికి ఓ సిద్ధాంతమంటూ లేదని పెంచి పోషించిన పార్టీని మోసం చేసిన వారు రేపు ఎవరినైనా మోసం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను చూసి పాలకుల్లో వణుకు పుట్టిందన్నారు. దీపావళి రాకముందే మహాలక్ష్మితల్లి గడపదగ్గర నిలబడి ఉందని ప్రతి పేదవాడి గడప దగ్గర నిలబడి ఉందని ఆ మహాలక్ష్మిని సాదరంగా ఇంట్లోకి తీసుకువెళ్లి ప్రతి నెల రూ.2500 లబ్ధిపొందాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని గ్రేటర్ హైదరాబాద్‌లోనే ముషీరాబాద్ నియోజకవర్గంలో అత్యంత తక్కువ ఖర్చు చేసిన ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ నిలిచిపోయారన్నారు. అంజన్‌కుమార్‌యాదవ్ ఎంపీగా ఉన్న సమయంలో రెండు రోజుల్లోనే రూ.రెండు కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. తాము గెలిచిన తరువాత ఆరు నెలల్లోనే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని 2014లో బీజేపీని, 2018లో బీఆర్ఎస్‌ను గెలిపించిన ప్రజలు 2023లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

స్విమ్మింగ్‌లో బద్రుకా కళాశాలకు ద్వితీయ స్థానం



కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన ఇంటర్ కాలేజీ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కాచిగూడ భద్రుకా కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. 17 పాయింట్లతో ఎంవీఎస్ఆర్ కాలేజ్ మొదటి స్థానం పొందగా 12 పాయింట్లతో భద్రుకా కళాశాల 2వ స్థానం సాధించింది. జ్వాలా తనయ్ సింగ్ (పురుషుల విభాగంలో 3 గోల్డ్‌మెడల్స్, 1 సిల్వర్ మెడల్), ధనుష్ గూడ (పురుషుల విభాగంలో కాంస్య పతకం), కీర్తి ఆనంద్ (మహిళల విభాగంలో 2 రజత పతకాలు) సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు బి.మనోజ్ కుమార్, బి.రాజారాం తదితరులు అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

నల్లకుంట: నల్లకుంటకు చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబి కండువాలు కప్పిన ఎమ్మెల్యే కాలేరు బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో శ్రీజ, అశోక్ యాదవ్, భీమ్ రావు, చందు, శివ ప్రసాద్, నర్సింగ్ తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు గాలపల్లి శంకర్, రమణానాయుడు పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో బీఆర్ఎస్‌దే విజయం



గోల్నాకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని మెజార్టీలో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన గోల్నాక డివిజన్ అన్నపూర్ణ నగర్, లాల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందరినీ పేరు పేరున పలకరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అందరితో ఉంటూ అందరివాడిగా ఉన్నానని, ఎన్నికల్లో అంబర్‌పేట ప్రజలంతా తనవైపే ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.